నగరం.. జాతరకు సిద్ధం

- తొలిపూజ సమయం ఖరారు
- నేటి అర్ధరాత్రి నుంచే పూజలు
- రేపు గంగ జాతర ప్రారంభం



నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చేందుకు ఏర్పాటు చేసిన మండపం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గంగ జాతరకు సన్నద్ధమవుతోంది. ప్రతి ఏటా లాగే ఈ సారి కూడా అదే ముహూర్తంలో జాతరను ప్రారంభించేలా కంకణం కట్టారు. మంగళవారం జాతర ప్రారంభమై మరుసటి రోజు నిమజ్జనం చేయనున్నారు. మంచి ముహూర్తం చూసి పూజ కైంకర్యాల సమయాన్ని కూడా ఖరారు చేశారు. జాతర ఏర్పాట్లు పూర్తి దశకు చేరుకున్నాయి. అమ్మవారు కొలువుదీరే ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ దీపాలతో ముస్తాబు చేస్తున్నారు. భారీ స్థాయిలో అమ్మవారి విద్యుత్ కటౌట్లను కడుతున్నారు. దీంతో చిత్తూరులో వాడవాడలా జాతర సందడి నెలకొంది

ఇది జాతర ముహూర్తం

- చిత్తూరు నగరంలోని నడివీధి గంగజాతరకు సోమవారం అర్ధరాత్రి నుంచి పూజలు ప్రారంభమవుతాయి. ఇక్కడ జాతరలో భాగంగా ఆనవాయితీ ప్రకారం రాత్రి 12 గంటలకు ఎల్ల దేవతల వద్ద పూజలు చేయనున్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా మీరాసీదారులచే అమ్మవారు సామగ్రి తీసుకొచ్చి నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించనున్నారు. మంగళవారం వేకువజామున 4 గంటలకు వంశపారంపర్య ధర్మకర్తలచే తొలిపూజ జరగనుంది. తెర తీసిన తరువాత భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించి దర్శించుకోనున్నారు. దీపం వెలిగించిన తరువాత అంటే సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి భక్తులు కుంభం నైవేద్యంగా సమర్పిస్తారు. మరుసటి రోజు నిమజ్జనం ఉంటుంది.
- కొంగారెడ్డిపల్లిలో ఈ సారి గంగజాతర నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు గంగమ్మకు మొదటిపూజ చేయనున్నారు. 9.10లకు అంబలి పూజ, సాయంత్రం 5కు కుంభం, రాత్రి 10కి పాటకచ్చేరి, బుధవారం రాత్రి 8 గంటలకు నిమజ్జనం మొదలుపెట్టనున్నారు. 10.30 గంటలకు సమీపంలోని ఐ ఆస్పత్రి వెనుక భాగంలో ఉండే బావిలో జలధి పూజ ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.
- సంతపేటలో మంగళవారం ఉదయం 7 గంటలకు తొలిపూజ ప్రారంభం కానుంది. అంబలి సమర్పణ, అమ్మవారి దర్శనం, విశేష పూజలు ఉంటాయి. రాత్రి 7 గంటలకు కుంభం సమర్పణ, 9 గంటలకు వీధి నాటక ప్రదర్శన ఉంటుంది. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి ఊరేగింపు ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.
- కట్టమంచిలో కూడా గంగ జాతర వేడుకగా చేపట్టనున్నారు. సోమవారం రాత్రి 10.30 గంటలకు స్థానికంగానే ఉండే కాళికాదేవి అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి శిరస్సును రజకుల ఇంటిలోకి తీసుకెళ్తారు. అక్కడి నుంచి మంగళవారం వేకువజామున 3.30 గంటలకు కట్టమంచి జాతర మండపానికి తీసుకొస్తారు. ఉదయం 5.30 గంటలకు తెర ప్రారంభించి తొలిపూజ చేస్తారు. అంబలి, కానుకల సమర్పణ, సాయంత్రం 6.15 గంటలకు నుంచి కుంభం సమర్పణ, రాత్రి 9గంటలకు పాటకచ్చేరి కార్యక్రమాలు ఉంటాయి. బుధవారం రాత్రి 7గంటలకు అమ్మవారు నిమజ్జనానికి బయలు దేరుతారని జాతర పెద్దలు పేర్కొన్నారు.
- దొడ్డిపల్లిలో సోమవారం రాత్రి 9 గంటలకు జాతర పందిరి వద్ద ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ శిరస్సు ఊరేగింపుగా ఇంటింటికీ వెళుతుంది. ఇది మంగళవారం ఉదయం 5గంటల వరకు కొనసాగుతుంది. ఉదయం 8గంటలకు మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి సమర్పిస్తారు. సాయత్రం 6 గంటలకు కుంభం సమర్పణ, పాటకచ్చేరి, రాత్రి 9గంటలకు వీధినాటకం, బుధవారం సాయంత్రం 5.30 గంటలకు నిమజ్జనం కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపడతారు. ఊరి చివరన ఉండే బావిలో 9.30 గంటలకు జలధి చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.
- గిరింపేటలో సోమవారం రాత్రి 11 గంటలకు శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయం నుంచి శిరస్సు తీసుకొస్తారు. అక్కడ గంగమ్మ పందిరిలో సింహవానంపై అమ్మవారిని కొలువుదీర్చి మంగళవారం ఉదయం 5.30 గంటలకు తొలిపూజ, మధ్యాహ్నం 12 గంటల వరకు అంబలి సమర్పణ, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10 గంటల వరకు కుంభం సమర్పణ, బుధవారం రాత్రి 7 నుంచి 10.30 గంటలకు వరకు ఊరేగింపు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేలా జాతర పెద్దలు ముందుగానే తీర్మానించారు. ఈ జాతరను అట్టహాసంగా జరిపించేలా చూస్తున్నారు. అమ్మవారికి మొక్కు చెల్లించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని అంచనా వేసి ఏర్పాట్లను పూర్తి చేస్తూ వస్తున్నారు.



నగరంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుత్ కటౌట్



ముస్తాబవుతున్న మండపం

క్లుప్తంగా

వీర జవాన్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కాశ్మీర్‌లో వీర మరణం పొందిన అమర జవాన్ మురళీనాయక్‌కు సీపీఐ నాయకులు, పెద్దదళితవాడ వాసులు నివాళి అర్పించారు. ఆదివారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, మాజీ కౌన్సిలర్ రాజా, ఆంధ్రబ్యాంక్ మాజీ మేనేజర్ హరికృష్ణమూర్తి, నాయకులు, స్థానికులు కృష్ణమూర్తి, విజయ చక్రవర్తి, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో గురుసంక్రమణ పూజలు



దీపారాధన పూజలో భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో గురు సంక్రమణ పూజలను భక్తిప్రపత్తులతో జరిపించారు. తొలుత మూలస్థానంలోని స్వామికి అభిషేకం చేశారు. తర్వాత ఆలయ ఆవరణలో శివలింగ ఆకారంలో దీపారాధన చేశారు. అనంతరం అర్చకులు శివాచార్యులు, ట్రస్టు చైర్మన్ వెంకటేశులు మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 1.19 గంటలకు స్వాతి నక్షత్రం వృషభ రాశి నుంచి మిథున రాశికి సంక్రమించిందన్నారు. మిథునం, మేషం, కర్కాటకం, వృశ్చికం, మకరం, మీనం రాశుల వారు అర్చన చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

గంగమ్మ ఆభరణాల ప్రదర్శన



ఆభరణాల ప్రదర్శనలో జాతర నిర్వాహకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని గీతామందిరంలో ఆదివారం నడివీధి గంగమ్మ అలంకరణ ఆభరణాలను జాతర వంశపారం పర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సీ.కేబాబు ప్రదర్శించారు. 103 గ్రాములతో తయారుచేసిన బంగారు మంగళసూత్రం, వెండి నాగపడగను సీకే బాబు, సతీష్, వెంకటేష్ బహూకరించినట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.. అలాగే సీఆర్‌సీ రవి ఫ్యాన్సీ జ్యువెలరీ అంటే హారము, వడ్డాణం, కాళ్ల గజ్జెలు, ప్రముఖ వ్యాపార వేత్త వేమారెడ్డి రూ.85వేలు విలువ చేసే బంగారు ముక్కెరను బహుకరించారు. అనంతరం జాతర ఏర్పాట్లను నిర్వాహకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మంగళ, బుధ వారాల్లో అత్యంత వైభవోపేతంగా జరిగే నడివీధి గంగమ్మజాతర వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని గ్రామదేవతలకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. పొన్నియమ్మ, దుర్గమ్మ, కరిమారియమ్మ, ముత్యాలమ్మ తదితర ఆలయాల వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. విశేష పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ఈకేవైసీ విధిగా చేయించుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఇందులో పిల్లలకు, 80 ఏళ్లు దాటిన వృద్ధులకు మినహాయింపు ఉందన్నారు. ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని సభ్యులు గడువులోపు పూర్తి చేసుకోవాలన్నారు. త్వరలో ప్రభుత్వం ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందించనుందని ఆయన పేర్కొన్నారు.

బైబిల్ శిక్షణ తరగతులు

బంగారుపాళెం: స్థానిక కార్నర్‌స్టోన్ చర్చి ఆవరణలో పిల్లలకు బైబిల్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. గత వారం రోజుల పాటు పిల్లలకు చిల్డ్రన్ బైబిల్ తరగతులు నిర్వహించారు. ఆదివారం చివరిరోజు పిల్లలకు ఆటలపోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు మేరీజాన్, శామ్యూల్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గుడిపాల: రేషన్‌కార్డు లేని వారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జయంతి మండల ప్రజలకు సూచించారు. ఆమె మాట్లాడుతూ దరఖాస్తు దారులు తప్పనిసరిగా ప్రజా సాధికార సర్వేలో నమోదై ఉండాలన్నారు. కొత్తగా పెళ్లయిన వారు వివాహ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలతో సమీప గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. పాత కార్డులకు సంబంధించి మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

బంగారుపాళెం: మండలంలోని కుమ్మరపల్లెలో సోమవారం శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. శ్రీకోదండ రామచంద్ర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు గోపూజ, సీతారాముల వారికి పంచామృతాభిషేకం, సాయంత్రం స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలంలో 92 పనులకు గాను రూ.7.82 కోట్ల వ్యయం చేసినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు మండలంలో ఆదివారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు రూ.7.82 కోట్లతో సుమారు 92 అభివృద్ధి పనులను చేశామన్నారు. అలాగే 5 వెంకటాపురం గ్రామం వద్ద ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్వరలో 6 కంపెనీలు ప్రారంభం కాబోతున్నాయన్నారు. బీఎన్ఆర్ పేట వంక నుంచి జీడీ నెల్లూరు ఆత్మకూరు వైపు వంతెన మంజూరైందని వివరించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

గుడిపాల : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. ఆదివారం కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి గుడిపాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉపాధిహామీ, ఉద్యానశాఖ, జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో రూ.13.86 కోట్లతో చేపట్టనున్న 279 పనులకు శంకుస్థాపనలు చేశారు. పశుమంద, కట్టకిందపల్లె, కోలావూరు, బట్టువాళ్లూరు గ్రామాల్లో గోకులం షెడ్లు, నీటి తొట్టెలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ హేమలత, ఎంపీడీఓ శిరీషా, ఏపీడీ సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, నాయకులు బాలాజీ నాయుడు, సుబ్బానాయుడు, అనిల్, సాంబశివనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాణిపాకం–విజయవాడ టూర్ ఆంతర్యమేమిటో!

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన పాలకమండలి చైర్మన్ కుర్చీ రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఇటు నియామకం ఆలస్యం కావడంతో భక్తుల్లో పలు అనుమానాలకు దారితీస్తోంది. ఆశావహుల్లోనూ గుబులు పుట్టిస్తోంది. ఈ తరుణంలో ఓ వర్గం కూటమి నేతల కాణిపాకం టూ విజయవాడ టూర్ వెనుక ఆంతర్యమేమిటో అని ఆరా తీస్తున్నారు. పెళ్లి, ఇతర కార్యక్రమాలతో గత కొన్ని రోజులుగా విజయవాడ వెళ్లి వస్తున్న ఆ నేతలు, వారివర్గంపై అందరి చూపు పడింది. అసలు విషయానికి వస్తే, కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ చైర్మన్‌కు మళ్లీ చైర్మన్ పదవి అనే ప్రచారం జోరందుకుంది. అధిష్టానం కూడా మాట ఇచ్చిందన్న నమ్మకంతో ఆ వర్గం నాయకులు ధీమాగా ఉన్నారు. అయితే ఆశావహుల్లో మరో ఇద్దరు నేతలు ఆ వర్గానికి కాణిపాకం–విజయవాడ టూర్‌తో గట్టి షాక్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఒకే గ్రామానికి చెందిన ఆ ఇద్దరి నేతలు చైర్మన్ పదవి కోసం రాష్ట్ర స్థాయిలో ఉడుము పట్టు పటినట్లు జోరుగా చర్చలు నడుస్తున్నాయి. మాజీ చైర్మన్‌కు మళ్లీ పదవి ఇవ్వకూడదనే పట్టుదలతో వారు చైర్మన్ పదవి కోసం గట్టిగా పట్టుబడుతున్నారని గ్రామస్తులు, ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈ కారణంగానే అధిష్టానం చైర్మన్ పదవి ప్రకటనను పెండింగ్‌లో పెడుతున్నట్లు సమాచారం.

డివైడర్లపై పచ్చదనం మాయం



గుడిపాల: డివైడర్లపై పచ్చదనం కరువైంది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిని క్రాస్ రోడ్డు సమీపంలో విస్తరించారు. అందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ఇందులో భాగంగా సెంటర్ డివైడర్‌పై వివిధ రకాల మొక్కలు నాటించారు. వీటి సంరక్షణను పట్టించుకోకపోవడంతో మొక్కలన్నీ ఎండిపోయాయి. ఈ రోడ్డంతా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పచ్చదనాన్ని పరిరక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రెడ్డివారిపల్లె గ్రామంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, కుమ్మరపల్లెలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారుపాళెంలో వర్షం



రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు మహిళలు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది. సాయంత్రం 6.20 నుంచి 7 గంటల వరకు జోరుగా వర్షం కురిసింది. వర్షం కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షానికి మురుగునీటి కాలువలు పొంగి జాతీయ రహదారిపై ప్రవహించాయి.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఖాతాలు సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. పీఎం కిసాన్ రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14వేలు కలిపి విడతల వారీగా రూ.20వేలు అందుతాయని చెప్పారు. రైతులు ఆధార్‌కార్డు, పొలం పాస్ బుక్, బ్యాంక్ ఖాతా పుస్తకంతో ఆర్ఎస్‌కేల్లో సంప్రదించాలని, ఇందుకు ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే గడువుందని వివరించారు.

అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్త





ఇంద్రానగర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ, సిబ్బంది, ఇళ్లవద్ద ఆధార్ కార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

బంగారుపాళెం: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని ఎద్దులవారిపల్లెల్లో ఆదివారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని సిబ్బందితో కలసి చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీస్‌శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చట్టవ్యతిరేకులు, చట్టాలను అతిక్రమించి డ్రగ్స్, గంజాయి, సారా విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులు ప్రజల మధ్య తిరుగుతున్నారా? అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గ్రామంలో సభ ఏర్పాటు చేసి అపరిచితులు, అనుమానితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గొడవలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో కలసిమెలసి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐ మల్లప్ప పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

చిత్తూరు అర్బన్: నగరంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని, అపరాధ రుసుం వసూలు చేస్తామని ఎంహెచ్‌వో లోకేష్ స్పష్టం చేశారు. కమిషనర్ పి నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆదివారం నగరంలోని ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. వేలూరు రోడ్డులోని ఒక షాపింగ్ మాల్ వ్యర్థాలను బహిరంగ ప్రాంతాల్లో పడేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినా, సదరు షాపింగ్ మాల్ నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన వ్యర్థాలు పడేయడంతో రూ.2వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. నగరంలోని షాపింగ్ మాల్స్, దుకాణదారులు తమ వ్యర్థాలను నిర్దేశించిన బిన్‌లోనే వేయాలని, లేకుంటే నగరపాలక పారిశుద్ధ్య కార్మికులకు అందివాలన్నారు. రోడ్డుపై పడేస్తే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో మంత్రి అచ్చెన్నాయుడు



స్వామి సన్నిధిలో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. ఆయనకు ఈవో పెంచలకిషోర్ స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, సీఐ శ్రీధర్ నాయుడు తదితరులు ఉన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుడిపాల: ఆ పాత మధురాలను నెమరువేసుకోవడానికి వారు చదువుకున్న పాఠశాల వేదికైంది. దాదాపు 32 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు తాము చదవుకున్న పాఠశాలలోనే ఆదివారం కలుసుకున్నారు. ఆనాటి మధుర సంఘటనలను నెమరు వేసుకున్నారు. తీపి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ అపూర్వ ఘట్టానికి మండలంలోని కమ్మతిమ్మాపల్లె ఉన్నత పాఠశాల ఆదివారం వేదికైంది. ఈ పాఠశాలలో 1992–93 లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడ్డారు. వీరందరూ ఒకచోట కలవాలని నిశ్చయించుకుని కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను, అనుభూతులను, అనుభవాలను పంచుకున్నారు. ఇందులో వారికి చదువులు నేర్పిన గురువులను సన్మానించారు. వీరితో పాటు 1992–93లో చదువుకున్న కొంతమంది ఆర్మీలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందారు. వారిని కూడా సన్మానించారు. తమతో చదువుకుని దేశ సైన్యంలో ఉద్యోగాలు పొందడం గర్వంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలకు రూ.40వేలు విలువచేసే మైకొసెట్, స్పీకర్‌ను పాఠశాలకు అందించారు.



సన్మానం అందుకుంటున్న మాజీ సైనికులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు - పూతలపట్టు :
95539 55610